అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిలర్లతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, జనవరి 22: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, సూర్యాపేటలో ఎప్పటి మాదిరిగానే ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పదవీ కాలం ముగియబోతున్న సందర్భంగా కౌన్సిలర్లను అభినందించి మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో సూర్యాపేట మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సూర్యాపేట పోరాటాల గడ్డ అని, ఆ చైతన్యంతోనే దళిత మహిళను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమించినట్లు తెలిపారు. గతంలో సద్దుల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మాణం చేసుకున్నామని, పుల్లారెడ్డి చెరువు వద్ద పనులు పూర్తి కాలేదని, అదేవిధంగా నల్ల చెరువు వద్ద కూడా మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం చేపట్టడానికి ఎమ్మెల్యేగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సూర్యాపేట మున్సిపల్ కార్మికులు, సిబ్బంది మెరుగైన పనితీరుతోనే జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని, ఇదే స్ఫూర్తిని భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు.

సమావేశం దృష్టికి పలు సమస్యలు..

కాగా, మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. పట్టణంలోని మంచి నీటి సమస్యను పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. బస్తీల్లో నీటి సరఫరాను మెరుగుపర్చాలని, పేదలు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీటి సరఫరాను పెంచాలని అధికారులకు అనేక మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఇంగ్లీష్ భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి'

మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటరాజయ్య

సూర్యాపేట టౌన్, జనవరి 21: ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులువు అవుతుందని ప్రొఫెసర్ వెంకటరాజయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాల భవన్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఒలింపియాడ్ ఉపన్యాస పోటీ పరీక్షల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు అందించే బోధనతో పాటు సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకొని విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి 109 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, పలువురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఎల్తా జిల్లా అధ్యక్షుడు రామ్ సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పబ్బతి వెంకటేశ్వర్లు, బెల్లంకొండ రామ్మూర్తి, ఖాసింఖాన్, బెజ్జంకి శ్రీనివాసచారి, మండవ సైదులు, ప్రవీణ్‌కుమార్, సైనాజ్ బేగం, డేగల కృష్ణ, నస్రీన్, పద్మశ్రీ, అరుంధతి, జిలానీ, రమేశ్, వెంకయ్య, శైలజ, బి.వీరస్వామి పాల్గొన్నారు.

'విద్యార్థి దశ నుంచే క్రీడలపై శ్రద్ధ చూపాలి'

క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న వీరయ్య

చివ్వెంల, జనవరి 21: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల శ్రద్ధ వహించాలని నల్లగొండ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు వీరయ్య సూచించారు. మండల పరిధిలోని ఉండ్రుగొండ శివారులో గల స్వామి నారాయణ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మంగళవారం గురుకుల ఒలింపిక్స్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ఆటలు విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆనంద్, డైరెక్టర్ హార్ధిక్, పిడిగడ్డం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేదంటే నో ఎంట్రీ

- కలెక్టరేట్‌కు రావాలంటే హెల్మెట్, సీటు బెల్ట్ పెట్టాల్సిందేనని కలెక్టర్ ఆదేశాలు

కలెక్టరేట్‌కు వస్తున్న వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సూర్యాపేట, జనవరి 21: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో వచ్చేవారు సీటు బెల్ట్ పెట్టుకుంటేనే సూర్యాపేట కలెక్టరేట్‌లోకి ప్రవేశం ఉంటుందని, ఇది అధికారుల నుంచి కార్యాలయానికి వచ్చే ప్రజల వరకు వర్తిస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. జనవరి 20వ తేదీ నుంచే అమలు చేయాలని ఆదేశించడంతో కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి సెక్యూరిటీ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ పెట్టుకొండి.. ప్రాణాలు కాపాడుకోండి అని చెబుతున్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ పెట్టుకోకుంటే కార్యాలయం గేటు బయటే వాహనాలను నిలిపి వేస్తామని సిబ్బంది తేల్చిచెబుతున్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను
ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 22 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.
NLG-340012

పాస్‌పోర్టు పోయినది
సయ్యద్ మీర్ అలీమ్ ఆలమ్, తండ్రి: అహ్మద్ అలీ, R/o. H.No.5-12-68/1, రహమత్ నగర్ స్ట్రీట్, నల్లగొండ పట్టణం & జిల్లాకి చెందిన నేను నాయొక్క పాస్‌పోర్ట్ నెంబర్ A3961618, రహమత్‌నగర్ నుండి YSR Statue దేవరకొండ రోడ్‌కు బైక్‌పై వెళ్తున్న సమయంలో నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. కావున ఎవరికైన దొరికినచో ఈ నెంబర్‌కు సమాచారం ఇవ్వగలరు. ఫోన్ నెంబర్ 9440033618.

PLOT FOR SALE
★యాదాద్రి టెంపుల్‌కి సమీపంలో మోత్కూర్ రోడ్, చీమల కొండూరులో రూ. 3,999/-లకే గజం భూమి అమ్మబడును. ఈ ఆఫర్ కొద్దిరోజులు మాత్రమే. Ph: 7989747927.
NT-327005

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రుజువులతో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్రయిమములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్లు ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | తొర్రూర్ : 9182777638

నిరసనలు.. నిలదీతలు

- రసాభాసగా గ్రామసభలు
- జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండడంపై ప్రజల ఆగ్రహావేశాలు

తుంగతుర్తి: సింగారంతండాలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

సూర్యాపేట రూరల్: సోలిపేటలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

సూర్యాపేట రూరల్, జనవరి 21: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు అర్హులను గుర్తించేందుకు మంగళవారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండడంపై ప్రజలు ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేశారు. అధికారులను నిలదీశారు. అధికారుల తీరుతో అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట మండలంలోని సోలిపేట, ఆరెగూడెం, రామచంద్రాపురం, బాలెంల, జాటోతుతండా, ఇమాంపేట, రాయినిగూడెం, పిల్లలమర్రి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కొందరు అనర్హులు పేర్లు జాబితాలో ఉండడం, అర్హుల పేర్లు లేకపోవడంతో సోలిపేట, రాయినిగూడెం గ్రామాల్లో అధికారులను ప్రజలు నిలదీసి ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు సర్ధిచెప్పడంతో శాంతించారు. ఆయా సభల్లో ఆర్డీఓ వేణుమాధవరావు, తాసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండలంలోని కందిబండ, నల్లబండగూడెం, వేపలమాధవరం, మంగలి కుంటతండాల్లో గ్రామసభలు నిర్వహించారు. కందిబండ, నల్లబండగూడెం గ్రామాల్లో అర్హులకు అన్యాయం జరిగిందంటూ పలువురు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అర్హులు తిరిగి దరఖాస్తులు అందిస్తే పరిశీలిస్తామని అధికారులు, పోలీసులు సర్ధి చెప్పడంతో శాంతించారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తాసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, ఇన్‌ఛార్జి ఎంపీఓ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: దిర్శించర్ల గ్రామంలో కొంత మంది అర్హుల పేర్లు లేవని అధికారులను ప్రశ్నించారు. పేర్లు రానివారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆయా సమావేశాల్లో ఎంపీడీఓ సోమసుందర్ రెడ్డి, తాసీల్దార్ సురగి సైదులు, ఏఓ జావీద్, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలంలోని గరిడేపల్లి, గడ్డిపల్లి, కీతవారిగూడెం, సర్వారం, గానుగబండ, కట్టవారిగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో సభలను నిర్వహించారు. సర్వారం గ్రామానికి చెందిన బుడిగ రమేశ్ అర్హులందరికీ పథకాలను వర్తింపజేయాలని అధికారులను నిలదీశారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్‌ప్రసాద్. మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, తాసీల్దార్ కవిత, ఎంపీడీఓ సరోజ, ఎంఈఓ చత్రునాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నడిగూడెం: మండలంలోని వేణుగోపాలపురంలో అనర్హులకు పథకాలను వర్తింపజేస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పేర్లే ఉన్నాయని ఆరోపించారు.

పెన్‌పహాడ్: మండలంలోని న్యూ బంజారా హిల్స్ తండా, దుబ్బతండా, నారాయణగూడెం, చెట్ల ముకుందాపురం, గుడెపుకుంట తండా, చిన్న సీతరాంతండా, నాగులపహాడ్, రంగయ్యగూడెం గ్రామాలో గ్రామసభలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అధికారులు ప్రకటించిన జాబితాపై ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అసలైన అర్హులను పక్కన పెట్టారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సర్వేను సరిగా నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా సివిల్ సప్లై డీఎం ప్రసాద్, తాసీల్దార్ దారవత్ లాలునాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏఓ అనిల్‌నాయక్, ఎంపీఓ సంజీవయ్య, ఏపీఎం అజయ్‌నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్: మండలంలోని పీపానాయక్‌తండా, బోట్యతండా, ఏనుబాముల, నెమ్మికల్, కోటినాయక్‌తండా, గట్టికల్లు, దాసారం, తుమ్మలపెన్‌పహాడ్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేలా పథకాలు ఉన్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నవారికి కాకుండా పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని విన్నవించారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఏఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండలంలోని తాటిపాముల, వెలిశాల, గుండెపురి, తొండ, చింతలకుంటతండా, కన్నారెడ్డికుంటతండాతో పాటు తిరుమలగిరి మున్సిపాలిటీలోని 4 వార్డుల్లో సభలు నిర్వహించారు. అయితే, తిరుమలగిరిలోని నాలుగో వార్డులో అర్హుల గుర్తింపు సరిగా జరగలేదని ప్రజలు ఆరోపించారు.

నూతనకల్: మండలంలోని చిల్పకుంట్ల, మాచనపల్లి, టీక్యాతండా, పెదనెమిల గ్రామసభల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. జాబితాలో పేర్లు రాని వారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రాంబాబు, తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సునీత, ఏఓ మురళిబాబు పాల్గొన్నారు.

మునగాల: మండలంలోని నారాయణగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొని ఉద్రిక్తతలకు దారితీసింది. అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపిస్తుండగా అర్హుల పేర్లు కాకుండా భూములు ఉన్న కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉండటంతో అధికారులను గ్రామస్తులు ప్రశ్నించారు. దీంతో తమకేం సంబంధం లేదని, కంప్యూటర్‌లో పేర్లు వచ్చాయి కనుకనే వారి పేర్లు చదివామని, రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు అనడంతో ఆగ్రహించిన ప్రజలు ఒక్కసారిగా అధికారులతో గొడవకు దిగారు. కావాలనే అధికారులు కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తూ అర్హులను పక్కన పెట్టారని, అనర్హుల పేర్లు ఎక్కించి కంప్యూటర్‌లో వచ్చాయి అని అధికాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామసభ వద్దకు చేరుకొని ప్రజలతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో మండల ప్రత్యేక అధికారి శిరీష మాట్లాడారు. అర్హులు దరఖాస్తు చేసుకుంటే కొత్త జాబితాను తయారు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మోతె: మండలంలోని సిరికొండ గ్రామంలో రేషన్ కార్డులకు సంబంధించి అర్హుల పేర్లు కాకుండా అనర్హులవి వచ్చాయని అధికారులను నిలదీశారు.

చివ్వెంల: మండల కేంద్రంతో పాటు ఐలాపురం, జి.తిర్మలగిరి, గాయంవారిగూడెం, ఎంజీ నగర్ తండా, సూర్యానాయక్‌తండా, గుంపుల, రోళ్లబండతండాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీఓ దయాకర్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండలంలోని సింగారంతండా, కొత్తగూడెం, రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాలో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. సింగారంతండాలో నిర్వహించిన గ్రామసభలో తాసీల్దార్ దయానందం పాల్గొనగా, జాబితాలో పేర్లులేని ప్రజలు సభలోనే నిలదీశారు. అదేవిధంగా కొత్తగూడెం గ్రామంలో ఎంఈఓ లింగయ్య, రావులపల్లిలో ఎంపీడీఓ శేషుకుమార్ పాల్గొనగా.. ఏ విధంగా అర్హులను గుర్తించారని అధికారులను ప్రశ్నించారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులు మరుగున పడ్డాయని మండిపడ్డారు.

మద్దిరాల: మండలంలోని రెడ్డిగూడెంలో నిర్వహించిన గ్రామసభలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీఓ పాండురంగన్న, ఏఓ పాలెం రజని, ఏపీఓ టానియారెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేటలో తిరగబడ్డ ప్రజలు

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రం సూర్యాపేటలోని 1వ వార్డులో నిర్వహించిన సభలో అధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రజలు తిరగబడ్డారు. నిలువ నీడలేని వారికి ఇళ్లిస్తామని చెప్పి మోసం చేశారని కంటతడి పెడుతూ శాపనార్థాలు పెట్టారు. 1వ వార్డు ఆవాసంలోని బుర్కపిట్టతండాలో ఎన్నో ఏండ్లుగా సుమారు 100 కుటుంబాలు నివాసం ఉంటుండగా, అందులో 60 మంది వరకు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, జాబితాలో తండాకు చెందిన కేవలం ఆరుగురి పేర్లు మాత్రమే చదివి వినిపించడంతో తండావాసుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దరఖాస్తు చేసుకున్న వారిలో దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఉన్నారని, మొదటి విడతలో వారికే ప్రాధాన్యత అని చెప్పి తండాలో ఇండ్లు, భూములు ఉన్నవారిని ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నోళ్లకి అన్నీ ఇస్తే లేనోళ్లు ఎటు పోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు నంబర్ కొడితే అన్ని వివరాలు వస్తాయని చెబుతున్నారని.. అలా మా ఆధార్ కార్డు కొట్టి చూస్తే మాకు ఏమేం ఉన్నాయో, మేమేందుకు అర్హులం కాకుండా పోయామో తెలుస్తుందన్నారు.

ఇతర వార్డుల్లో..

సూర్యాపేటలోని 1 నుంచి 12 వార్డుల్లో అధికారులు వార్డు సభలను నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హుల పేర్లు ఎంపిక చేశారని పలు వార్డుల్లో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ కార్డును అడుగుతున్నారని, సూర్యాపేట మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ఉపాధి కార్డులు లేవని.. తాము ఏం చేయాలని పలువురు వ్యవసాయ కూలీలు అధికారులను ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్..

హుజూర్‌నగర్ రూరల్,: వేపలసింగారంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పాల్గొన్నారు. జాబితాల్లో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి జాబితాను సరిజేస్తామని తెలిపారు. ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ నాగార్జునరెడ్డి, ఏఓ స్వర్ణ, స్పెషలాఫీసర్ మౌనిక, ఏపీఓ శైలజ, సివిల్ సప్లై డీటీ నాగేందర్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: గుడిబండ గ్రామసభలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

సూర్యాపేట రూరల్: రాయినిగూడెంలో ఆందోళన చేస్తున్న ప్రజలు

కోదాడ రూరల్: అర్హత లేని వారి పేర్లు ఎంపిక చేశారని ప్రశ్నిస్తున్న గుడిబండ వాసిని నిలువరిస్తున్న పోలీసులు

గరిడేపల్లి: సర్వారం గ్రామంలో అధికారులను నిలదీస్తున్న వ్యక్తి

సూర్యాపేట రూరల్: రాయినిగూడెంలో అధికారులను ప్రశ్నిస్తున్న మహిళ

చిలుకూరులో అధికారులను ప్రశ్నిస్తున్న నాయకులు

మునగాల: నారాయణగూడెం గ్రామంలో ఆందోళన చేస్తున్న ప్రజలు

మేళ్లచెర్వు: నల్లబండగూడెంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు

క్రీడలతో మానసికోల్లాసం : సీనియర్ సివిల్ జడ్జి సురేశ్

కోదాడ టౌన్, జనవరి 21: ఒత్తిడి నుంచి బయటపడేందుకు, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కోదాడలోని కోర్టు ఆవరణలో కోదాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడా పోటీలను అధ్యక్షుడు ఎస్ఆర్‌కే. మూర్తితో కలిసి మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. బార్ అసోసియేషన్ బాధ్యులు చింతకుంట్ల రామిరెడ్డి, గట్ల నరసింహారావు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిలివేరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

సూర్యాపేట టౌన్, జనవరి 21: జిల్లా కేంద్రం సూర్యాపేటలోని 17వ వార్డు చింతలచెరువు ప్రాథమిక పాఠశాల పక్కన రూ.2 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు వార్డు కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహజన్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, మాజీ కౌన్సిలర్ వేల్పుల సుధాకర్, రేగట్టి సైదులు, మామిడిశెట్టి అంజయ్య, రేగట్టి శంకరయ్య, పులిగుజ్జు సైదులు, ఇరగదిండ్ల వెంకన్న, శివరాత్రి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి మీదుగా కొత్త బస్సు సర్వీసులు ప్రారంభం

అర్వపల్లిలో హైదరాబాద్ సర్వీస్‌కు స్వాగతం పలుకుతున్న సూర్యాపేట డిపో మేనేజర్ సురేందర్ తదితరులు

అర్వపల్లి, జనవరి 21: అర్వపల్లి మీదుగా సూర్యాపేట డిపోకు చెందిన రెండు కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసులు మంగళవారం ప్రారంభమయ్యాయి. తుంగతుర్తి నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు ఉదయం 9 గంటలకు ప్రారంభమై 9.20 నిమిషాలకు అర్వపల్లి చేరుకొని జాజిరెడ్డిగూడెం మీదుగా దిల్‌సుఖ్‌నగర్‌కు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రారంభమై సాయంత్రం 4.00 గంటలకు అర్వపల్లికి చేరుకొని తుంగతుర్తి మీదుగా సూర్యాపేటకు వెళ్లనుంది. అదేవిధంగా మరో సర్వీసు సూర్యాపేట నుంచి ఉదయం 9 గంటలకు హనుమకొండకు బయలుదేరి అర్వపల్లి, తుంగతుర్తి, గొట్టిపర్తి మీదుగా తొర్రూరు నుంచి హనుమకొండకు ఒంటి గంటకు చేరుకుంటుంది. అర్వపల్లిలో హైదరాబాద్ బస్సు సర్వీస్‌కు సూర్యాపేట డిపో మేనేజర్ సురేందర్ తదితరులు స్వాగతం పలికారు. అసిస్టెంట్ మేనేజర్ బానోత్ సైదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి, జనవరి 21: మండల కేంద్రం గరిడేపల్లిలోని పొనుగోడు రోడ్డులో ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పొనుగోడు గ్రామానికి చెందిన చిరుకూరి సాయి మరొకరితో కలిసి బొలెరో వాహనంలో గరిడేపల్లి నుంచి పొనుగోడు వైపు వెళ్తుండగా, గరిడేపల్లి-సూర్యాపేట ప్రధాన రహదారిపై ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సాయికి గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేళ్లచెర్వు, జనవరి 21: మండలంలోని రేవూరు గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

నాగారం, జనవరి 21: మండలంలోని ఈటూరు గ్రామానికి చెందిన నంగనూరు సైదమ్మ(65) గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక బాధపడుతోంది. ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎం.ఐలయ్య తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ

నేరేడుచర్ల, జనవరి 21: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ జావీద్ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. 31-12-2024 నాటికి కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను దరఖాస్తు ఫారానికి జత చేసి ఈ నెల 26వ తేదీలోపు వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఖాతా నంబర్ మార్పులు చేసుకోవాలనుకునే వారు 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పీఆర్‌టీయూ డైర